## నేడు బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశం

గుమ్మడిదల/బొల్లారం, మే 18: బీఆర్‌ఎస్ నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశాన్ని ఆదివారం నిర్వహిస్తున్నామని పార్టీ గుమ్మడిదల మండల అధ్యక్షుడు మహ్మద్ హుస్సేన్, బీఆర్‌ఎస్ బొల్లారం మున్సిపల్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. ఆదివారం పటాన్‌చెరులోని జీఎంఆర్ కన్వెన్షన్ హాలులో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన బీఆర్‌ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ వ్యూహాలపై చర్చిస్తామని తెలిపారు. సభకు మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, శాసన మండలి మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ హాజరవుతున్నట్లు తెలిపారు. సమయానికి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

## మహిళ బ్యాగులో నుంచి బంగారం చోరీ

కోహీర్, మే 18: జహీరాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం సాయంత్రం ఓ మహిళా హ్యాండ్ బ్యాగులో నుంచి ఎనిమిది తులాల బంగారం చోరీ జరిగింది. పట్టణ ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఝరాసంగం మండలంలోని చీలెపల్లి గ్రామానికి చెందిన లక్ష్మి సంగారెడ్డి వెళ్లేందుకు బస్సు ఎక్కుతుండగా తన హ్యాండ్ బ్యాగును ఎవరో తాకినట్లు గుర్తించింది. వెంటనే బ్యాగు తెరిచి చూసేసరికి అందులో ఎనిమిది తులాల బంగారం కనిపించలేదు. వెంటనే పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై లక్ష్మారెడ్డికి ఫిర్యాదు చేసింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సీసీ పుటేజీని పరిశీలించినా ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఎనిమిది తులాల బంగారం చోరీ కావడంతో లక్ష్మి బోరున విలపించింది.

## ఆర్థికసాయం అందజేత



వాహీద్ కుటుంబీకులకు ఆర్థికసహాయం అందజేస్తున్న అబ్దుల్ ఖదీర్

రామచంద్రాపురం, మే 18: పేద కుటుంబానికి ఏకే ఫౌండేషన్ అండగా నిలిచింది. ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్‌కాలనీకి చెందిన మహమ్మద్ వాహీద్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొద్ది రోజులుగా క్యాన్సర్‌తో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలోనే అతడి కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికావడంతో విషయం తెలుసుకున్న ఏకే ఫౌండేషన్ చైర్మన్ షేక్‌అబ్దుల్ ఖదీర్ ఆ కుటుంబాన్ని పరామర్శించి రైస్‌బ్యాగ్, రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు.

## జూన్ 8న లోక్ అదాలత్




మాట్లాడుతున్న సూరి కృష్ణ

కోహీర్, మే 18: జహీరాబాద్ పట్టణంలోని సివిల్ కోర్టు ఆవరణలో వచ్చే నెల 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల లీగల్ సెల్ అథారిటీ చైర్మన్ సూరికృష్ణ కోరారు. శనివారం జహీరాబాద్ పట్టణంలోని బ్యాంకర్లు, న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా తమ విలువైన సమయాన్ని, డబ్బును ఆదా చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. కేసుల విషయంలో ఖాతాదారులు, బ్యాంకు అధికారులు రాజీపడాలన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్నా న్యాయవాదులను సంప్రదించాలని సూచించారు. 8వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో బార్ ప్రెసిడెంట్ గోపాల్, న్యాయవాదులు సోమశేఖర్, జగన్, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్ వలంటీర్లు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

## విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి

సిద్దిపేట టౌన్,మే 18 :జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి సూచించారు. జూన్ 8న జరుగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకొని జిల్లా కోర్టు సమావేశ మందిరంలో శనివారం పోలీస్, ఎక్సైజ్, రెవెన్యూశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారమయేలా చొరవ చూపాలన్నారు.

# వేసవి దుక్కులు.. ఎంతో మేలు

- చేన్లలో చీడపీడల నివారణ.. అధిక దిగుబడి
- సకాలంలో విత్తుకునే అవకాశం



రాయికోడ్‌లో ట్రాక్టర్‌తో దుక్కిని సిద్ధం చేస్తున్న రైతు

రాయికోడ్, మే 18: వేసవి దుక్కులతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ఇందుకు రైతులు సమాయత్తం కావాల్సిన అవసరం ఉంది. వేసవిలో దుక్కులు దున్నడం వల్ల చీడపీడల నివారణతోపాటు పంట దిగుబడి పెరుగుతుంది. వేసవిలో చేపట్టాల్సిన పనులపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పలు సూచనలు చేస్తున్నారు.

**అధిక దిగుబడికి మార్గం**

వేసవిలో దుక్కులు చేసుకోవడానికి సరిపడా తేమ ఉన్న చేనులో ట్రాక్టర్లు, ఎద్దుల నాగళ్లతో లోతుగా దున్నాలి. లోతుగా దున్నినప్పుడు నేలపై పొరల్లో ఉండే పురుగులు, తెగుళ్లను ఆశించే పురుగులు చనిపోయే అవకాశం ఎక్కువ ఉండడంతోపాటు నేలలో దాక్కునే క్రిమికీటకాలు ఎండకు నశిస్తాయి. దీంతోపాటు పంట పొలంలో కలుపు నివారించుకోవచ్చు. పొలంలో ఎక్కువగా తుంగ, గరిక, ఒలిపిడి, వంటి కలుపు మొక్కలతో పంటలకు నష్టం వాటిల్లుతుంది. వేసవి దుక్కులు దున్నుకోవడంతో కలుపు మొక్కల వేర్లు కాయలు, దుబ్బలు పెలికిపోయి బయటకు వచ్చి ఎండకి ఎండిపోతాయి, ఎండిపోయిన వేర్లు, కాయలు. దుంపలను ఏరివేస్తే మంచి ఫలితం ఉంటుంది. లోతు దుక్కులు చేసుకుంటే తొలకరి వర్షంలోనే విత్తనాలు విత్తుకునే పంటలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

**పశువులు, గొర్రెల మందలతో లాభం**

గతంలో రైతులు ఎద్దులు, అవులు, బర్రెలు, గొర్రెలు, మేకలను రాత్రిళ్లు పొలంలో మందలు పెట్టేవారు. పశువుల మలమూత్రాలతో సేంద్రియ ఎరువుగా మారి పంటలకు ఉపయోగపడేది. దీంతో రైతులకు ఎరువు ఖర్చు తక్కువగా ఉండేది. ప్రస్తుతం పశువులు తగ్గిపోవడంతో పంటలకు సేంద్రియ ఎరువు వాడకం తగ్గిపోతున్నది. రైతులు వేసవికాలంలో పంట చేన్లు, గొర్రెలు, బర్రెల మందను వారం పది రోజుల పాటు ఏర్పాటు చేసుకుంటే మంచి సేంద్రియ ఎరువు లభిస్తుంది.

### చేనులో కట్టె తొలిగిస్తున్నాం



పత్తి, ఇతర పంటల కట్టెలను ట్రాక్టర్‌తో తొలిగిస్తున్నాం. తొలకరి రాకముందే కట్టె తొలిగించి దుక్కిని సిద్ధం చేస్తున్నాం. గతేడాది పొలంలో పత్తి, ఇతర పంటలు సాగు చేసిన. ఈ సారి కూడా పత్తి, కంది, ఇతర పంటలు వేస్తాను.

- కిష్టారెడ్డి, రైతు, ఇటిక్యాపల్లి

### దుక్కులు సిద్ధం చేస్తున్నాం



వానకాలం పంటల సాగుకు దుక్కులు సిద్ధం చేస్తున్నాం. గతేడాది అధిక వర్షాలతో పత్తి దిగుబడి తగ్గినా మంచి ధర వచ్చింది. ఇతర పంటలకు పెట్టుబడ్డి లేదు. లాభం వచ్చినా, నష్టం వచ్చినా భూ దేవిని నమ్ముకునే బతుకుతున్నాం.

- మారుఫ్ అలీ, రైతు, సింగితం

### వేసవి దుక్కులతో మేలు



వేసవి దుక్కులతో వర్షాకాలంలో మంచి ఫలితాలు వస్తాయి. లోతుగా దుక్కులు దున్నుకుంటే పొలంలో ఉన్న చీడపీడ పురుగులు నశించి పంట దిగుబడి పెరుగుతుంది. రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి

- అవినాష్‌వర్మ, మండల వ్యవసాయాధికారి

# ఘనంగా వాసవి మాత జయంతి

రామచంద్రాపురం, మే 18: భారతీనగర్ డివిజన్ పరిధిలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాన్ని పువ్వులతో అలంకరించి ముస్తాబుచేశారు. ఆలయ పూజారులు అమ్మావారికి అభిషేకం, తదితర పూజలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు సింధూఆదర్శ్‌రెడ్డి, పుష్పానగేశ్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కన్యకాపరమేశ్వరి ఆలయాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆర్యవైశ్యులు ఐకమత్యంతో అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఆలయం ఆవరణంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, కుమార్‌గౌడ్, పరమేశ్, ఐలేశ్, ఆలయ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రాపురం: అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



సిద్దిపేట టౌన్: ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్న భక్తులు



సంగారెడ్డి: ర్యాలీని ప్రారంభిస్తున్న తోపాజి అనంతకిషన్



కోహీర్: అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

## 'వైద్యానికి వెళ్తే ప్రాణం తీశారు'

**విషయం బయటకు రాకుండా తొక్కిపట్టిన యాజమాన్యం!**




సంగారెడ్డి, మే 18: ప్రైవేటు దవాఖానల్లో మెరుగైన వైద్యసేవలు అందుతాయనే ఉద్దేశంతో చికిత్స చేయించుకునేందుకు వచ్చే బాధితుల ప్రాణాలకు గ్యారెంటీ లేకుండా పోతున్నది. ప్రైవేటు దవాఖానలో డబ్బులు ఖర్చయినా మెరుగైన చికిత్స అందితే చాలను కొని వెళ్తే అదే అదునుగా బాధితుల నుంచి ఆ దవాఖానలు ముక్కుపిండి వసూలు చేస్తాయి. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సహస్ర ప్రైవేటు దవాఖానకు ఈ నెల 12న పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన రాములు(40) కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతూ వచ్చాడు. అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి నాలుగు రోజులు చికిత్స అందించి ఇంటికి పంపించారు. తిరిగి శుక్రవారం ఉదయం అదే సమస్యతో బాధపడుతూ రాములు మళ్లీ అదే దవాఖానకు వచ్చాడు. అయితే శుక్రవారం ఉదయం చికిత్స చేస్తుండగా రాములు మృతి చెందాడని ఆయన భార్య, బంధువులకు వైద్యులు చెప్పడంతో ఒక్కసారిగా రోదనలు మిన్నంటాయి. ఈ విషయాన్ని గమనించిన దవాఖాన యజమాని డాక్టర్ రాజుగౌడ్ విషయం బయటకు రాకుండా మృతిడి బంధువులకు డబ్బులు ఇచ్చినట్లు సమాచారం. ఇంత జరిగినా జిల్లా వైద్యాధికారులు, పోలీసులకు సమాచారం అందకపోవడం విశేషం. ఒక వ్యక్తి ప్రాణాలు పోయిన ఉదంతం పట్టణంలో దావానంలా వ్యాపించినా బయటికి పొక్కకుండా యాజమాన్యం జాగ్రత్తలు పాటించడం కొసమెరుపు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

## సమ్మర్‌క్యాంప్ ప్రారంభం

రామచంద్రాపురం, మే 18: భెల్‌లోని కమ్యూనిటీ సెంటర్ ఆవరణలో శనివారం భెల్ జీఎంహెచ్‌ఆర్ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్ ప్రారంభించారు. చిన్నారులు, పెద్దలు కలిసి యోగా, ఫిట్‌నెస్ కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ వివిధ క్రీడలు, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు. సుమారు 600మంది పిల్లలకు ఈ సమ్మర్ క్యాంప్ దోహదపడుతుందన్నారు. భెల్ అధికారులు చంద్రశేఖర్, శ్రీకాంత్, మాయబ్రహ్మ ఉన్నారు.

# గిరిజన గురుకులాల్లో ప్రవేశాలు

జిన్నారం, మే 18: జిన్నారంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. మిగిలిన సీట్లకు రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని మానసహిల్స్‌లోని ప్రాంతీయ సమన్వయాధికారిని ఈనెల 23న ఉదయం 10.30గంటలకు సంప్రదించాలన్నారు. వివరాలకు 738 2931496, 63007 51374 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

**నారాయణఖేడ్ ఎస్టీ గురుకులంలో..**

నారాయణఖేడ్, మే 18: గిరిజన గురుకులంలో ఇంటర్మీడియట్‌లో స్పాట్ కౌన్సిలింగ్ ద్వారా ప్రవేశానికి అవకాశం కల్పిస్తున్నట్లు నారాయణఖేడ్ బాలుర ఎస్టీ గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమార్ తెలిపారు. ఎంపీసీ, బీపీసీ, గ్రూపుల్లో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు ఈ నెల 23న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులు సరైన ధ్రువ పత్రాలతో రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్‌లోని మానస హిల్స్‌లోని ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 83339 25393, 73829 31496 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

## దంచి కొట్టిన వాన

జిన్నారం, మే 18: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం వాన దంచికొట్టింది. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వడ్లను తీసుకొచ్చిన రైతులు వర్షానికి ఆగమాగం అయ్యారు. వర్షం నుంచి వడ్లను కాపాడుకోనేందుకు పట్టాల కోసం ఉరుకులు, పరుగులు పెట్టారు. బొల్లారం, ఖాజీపల్లి, గడ్డపోతారం పారిశ్రామిక వాడల్లో వరద నీటిని పరిశ్రమలు తమకు అనుకూలంగా మలుచుకున్నాయి. పరిశ్రమల్లో నిల్వ ఉన్న వ్యర్థాలను వాన నీటితో కలిపి వదిలాయి. రోడ్లపై వడ్లు ఆరబోసిన రైతులు ఆగమయ్యారు.

## దొరవాని కుంటలో దర్జాగా రోడ్డు నిర్మాణం

జిన్నారం, మే 18: మంగంపేట శివారులోని సర్వేనంబర్ 26లోని దొరవాని కుంట నుంచి కొందరు అక్రమంగా మట్టి రోడ్డు వేస్తున్నారని, దీనిని అడ్డుకోవాలని గ్రామస్తులు రెవెన్యూ, మండల పరిషత్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ రాములుకు శనివారం రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దొరవాని కుంట పక్కన భూమిని కొనుగోలు చేసిన వ్యక్తి కుంటలో నుంచి రోడ్డు వేస్తున్నాడని, దీనిని అడ్డుకొని తగు చర్యలు తీసుకోవాలని కోరారు. లక్షణ్, లక్ష్మణ్‌రావు, శ్రీకాంత్ ఉన్నారు.

## 21న క్రికెట్ జట్టు ఎంపిక

సంగారెడ్డి కలెక్టరేట్, మే 18: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 21న ఉదయం 10 గంటలకు ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ జట్టును ఎంపిక చేయనున్నట్టు అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్‌రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్టు 24 నుంచి హైదరాబాద్‌లో ప్రారంభమయ్యే అండర్-25 టీ-20 టోర్నమెంట్‌లో పాల్గొననున్నట్టు వెల్లడించారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ ఒరిజినల్ ఆధార్ కార్డు, జన్మదిన ధ్రువీకరణ పత్రాలతోపాటు రెండు ఫొటోలతో సకాలంలో హాజరుకావాలన్నారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన వారై ఉండాలని స్పష్టం చేశారు. ఈ నెల 21న సంగారెడ్డిలోని జూబ్లీ క్లబ్ ప్రాంగణంలోని ఎంఎస్ అకాడమీలో జరిగే ఎంపికకు క్రీడాకారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

## ధ్యాన మందిరంలో ఆరాధన పూజలు

బొల్లారం, మే 18: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బీసీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ధ్యాన మందిరంలో శనివారం వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటానికి విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఆరాధన పూజలు నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భరత్ చారి, విఠల్ చారి తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రభుత్వ భూముల విలువను పెంచొద్దు'



సమావేశంలో మాట్లాడుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజలింగం

సిద్దిపేట టౌన్, మే 18: ప్రభుత్వ భూముల విలువ పెంపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సిద్దిపేట రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజలింగం డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే రియల్ వ్యాపారం లేక పూర్తిగా రోడ్డున పడే పరిస్థితులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూముల విలువను పెంచాలని నిర్ణయించుకుందని.. అలా జరిగితే తమ బతులు చిన్నాభిన్నం అవుతాయన్నారు. ప్రభుత్వం మరోసారి ఆలోచించి 7.5 శాతంగా కొనసాగుతున్న రిజిస్ట్రేషన్ చార్జీలను మూడు శాతానికి తగ్గించి భూముల విలువను అలాగే కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, రంగయ్య, శ్రీనివాస్, చిన్నా, నర్సింహులు, యాదగిరి, బాలయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

సిద్దిపేట టౌన్,మే 18 : విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని ఆల్ ఇండియా ఐడల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యాఖినొద్దీన్ అన్నారు. సిద్దిపేట ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో శనివారం టెన్త్,ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన ముస్లిం విద్యార్థులను ఘనంగా సత్కరించి ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో ఇబ్రహీం, జుబేర్,నసీరొద్దీన్, అబ్దు ఖుద్దూస్,కమాల్ పాల్గొన్నారు.

# 24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి కలెక్టరేట్, మే 18: జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి ప్రారంభం అవుతాయని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో మొత్తం 31 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఆయా కేంద్రాల్లో మొత్తం 14,886 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో 9,318 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు, ఒకేషనల్ విద్యార్థులు 599 మంది విద్యార్థులు కాగా, 4,646 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు, ఒకేషనల్ విద్యార్థులు 323 మంది ఉన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం పరీక్ష, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరగనున్నాయి. 31 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 31 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, హెచ్‌పీసీ, డీఈసీ, ఫ్లైయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ కమిటీలను ఏర్పాటు చేశారు. అన్ని పరీక్షా కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించారు. జూన్ 3 వరకు పరీక్షలు సజావుగా జరిగేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉం టుందని, పరీక్షా కేంద్రాల పరిసరాల్లోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని ఆదేశించారు. వేసవి కాలం దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్భయంగా పరీక్ష రాయాలని, గంట ముందగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల విద్యార్థులకు వీలుగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

# వీరభద్రుడి హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

రాయికోడ్, మే 18: భద్రకాళీ సమేత వీరభద్రేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1.54 లక్షలకుపైగా వచ్చిందని ఉమ్మడి మెదక్ జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజు తెలిపారు. శనివారం మండల కేంద్రమైన రాయికోడ్‌లోని వీరభద్రేశ్వరస్వామి, భద్రకాళి ఆలయ హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఈ సందర్భంగా కమిషనర్ శివరాజు మాట్లాడుతూ.. నెల రోజుల పాటు భక్తులు సమర్పించిన ఆదాయాన్ని లెక్కించినట్లు తెలిపారు. ఈసారి ఆలయ హుండీ ఆదాయం రూ.1.54లక్షలు వచ్చాయని పేర్కొన్నారు. సిబ్బంది ప్రతిఒక్కరూ అందుబాటులో ఉండి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఈవో మోహన్‌రెడ్డి, ఎస్సై వెంకట్‌రెడ్డి, సిబ్బంది కృష్ణ, గ్రామ పెద్దలు మణెయ్య, రాచయ్యస్వామి, ఈశ్వరయ్యస్వామి, నారాయణపంతులు, సందీప్ స్వామి, పూజారులు ఉన్నారు.

# అక్రమ నిర్మాణాల కూల్చివేత



ఆసానికుంట వద్ద కూల్చివేతలు

బొల్లారం, మే 18: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని కోమటికుంట, మీది కుంట, ఆసానికుంటలలో నిర్మించిన అక్రమ కట్టడాలపై రెవెన్యూ యంత్రాంగం కొరడా ఝుళిపించింది. శనివారం కలెక్టర్ ఆదేశాల మేరకు ఇరిగేషన్, రెవెన్యూ మున్సిపల్ శాఖల అధికారులు సిబ్బంది మూడు కుంటల్లో ఆక్రమంగా నిర్మించిన నిర్మాణాలను జేసీబీలతో కూల్చివేయించారు. సర్వే నంబర్ 265 కోమటికుంటలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన రెండు అక్రమ కట్టడాలను, సర్వే నంబర్ 297 ఆసానికుంటలో నిర్మించిన అక్రమ కట్టడాలు, షెడ్లను, మీది కుంటను ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలను పోలీసుల సమక్షంలో ఆయా శాఖల అధికారులు కూల్చివేయించారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ.. ఇటీవల వచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనుమతులు లేకుండా కుంటలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ భూములు, కుంటల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ మున్ని నవీన్, పోలీసు, మున్సిపల్ శాఖ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

# పలుగు పోచమ్మ ఆలయంలో వేలం



వేలంపాట నిర్వహిస్తున్న సిబ్బంది

హత్నూర, మే 18: హత్నూర మండలం షేర్ఖాన్‌పల్లి శివారులోని పలుగు పోచమ్మ ఆలయం వద్ద కొబ్బరికాయలు, లడ్డు, పులిహోర విక్రయించడానికి శనివారం వేలంపాట నిర్వహించారు. షేర్ఖాన్‌పల్లికి చెందిన ప్రవీణ్‌గౌడ్ రూ.9లక్షల 25వేలకు కొబ్బరికాయలు, అదే గ్రామానికి చెందిన ప్రభాకర్ రూ.4లక్షల 15 వేలకు లడ్డు, పులిహోర విక్రయించడానికి వేలంపాట దక్కించుకున్నారు. వేలం హక్కులు పొందిన వారు సంవత్సరం పాటు వాటిని విక్రయించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది నరసింహారెడ్డి, శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు.




**ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్** (APGVB)
హెడ్ ఆఫీస్ : వరంగల్ — రీజినల్ ఆఫీస్ : సంగారెడ్డి

**వేలం అమ్మకం ప్రకటన (బంగారం)**

దిగువ తెలిపిన వ్యక్తులకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, వారు తమ రుణ ఖాతాలలో బకాయి మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలమైనారు. రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా వారికి నోటీసులు పంపబడినవి. అందువల్ల, 30-05-2024న లేదా ఆలోగా బకాయి మొత్తాలు మరియు ఇతర ఛార్జీలు చెల్లించి తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను విడిపించుకోవాల్సిందిగా వారు కోరబడుతున్నారు. విఫలమైనచో సదరు సెక్యూరిటీలు **30-05-2024న సా. 4.00గం.కు** లేదా తరువాత ఏదేని ఇతర అనుకూలమైన తేదీన బ్యాంక్ పూర్తి విచక్షణ మేరకు తదుపరి నోటీసు లేకుండా **సంబంధిత శాఖల** వద్ద బ్యాంక్ ఆవరణ వద్ద రుణగ్రహీత ఖర్చుతో బహిరంగ వేలంలో బ్యాంక్ ద్వారా విక్రయించబడతాయి.

| క్ర. సం. | బంగారం రుణ ఖాతా నెం. | రుణగ్రహీత పేరు & చిరునామా | బంగారం గ్రాములలో | శాఖ పేరు |
|---|---|---|---|---|
| 1 | 73200583242 | సొంతెన స్వాతి, భర్త సత్యం చారి, ఇం.నం. 8-961, సాయి ప్రియ కాలనీ, ముత్తంగి, సంగారెడ్డి-502300. | 24.23 | ఇస్నాపూర్-8167 M.No. 9490153751 |
| 2 | 73217386123 | సొంతెన స్వాతి, భర్త సత్యం చారి, ఇం.నం. 8-961 సాయి ప్రియ కాలనీ, ముత్తంగి, సంగారెడ్డి-502300. | 19.9 | ఇస్నాపూర్-8167 M.No. 9490153751 |
| 3 | 73199854612 | బ్యాగరి దుర్గా ప్రసాద్ తండ్రి బాల్‌రాజు ఇం.నం. 2-85 ఇంద్రేశం, పటాన్‌చెరు, సంగారెడ్డి పిన్-502319. | 15.32 | మార్కెట్ ఏరియా పటాన్‌చెరు-8191 M.No. 8331010431 |
| 4 | 73201379383 | బాను చండి, భర్త భోజ్యా, ఇం.నం. 3-166, కొత్తగూడెం, హత్నూర మండలం, సంగారెడ్డి-502296. | 24.2 | వడ్డేపల్లి-8155 M.No. 9490157398 |
| 5 | 73201420356 | మొలోళ్ళ రమేష్, తండ్రి పెంటయ్య, ఇం.నం. 3-11. చింతలచెరు, హత్నూర మండలం, సంగారెడ్డి-502296. | 25.5 | వడ్డేపల్లి-8155 M.No. 9490157398 |
| 6 | 73201591923 | మొహమ్మద్ సర్వార్ పాషా, తండ్రి ఇస్మాయిల్ సాహెబ్ ఇం.నం. 3-72-1, ఎల్లమ్మగూడ, హత్నూర మండలం, సంగారెడ్డి పిన్-502296 | 20 | వడ్డేపల్లి-8155 M.No. 9490157398 |

తేది: 18-05-2024 — సం/- రీజినల్ మేనేజర్, APGVB, సంగారెడ్డి రీజియన్.